క్లుప్తంగా

ఆపదలో ఉన్న వారికి అండగా వైఎస్సార్‌సీపీ

రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్



రేపల్లె(చెరుకుపల్లి): ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అనారోగ్యానికి, పలు ప్రమాదాలకు గురైన కార్యకర్తలను డాక్టర్ గణేష్ నియోజకవర్గ నాయకులతో కలిసి ఆదివారం పరామర్శించి వారికి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈవూరు గణేష్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రేపల్లె 24వ వార్డుకు చెందిన నాజర్‌వలి, 16వ వార్డుకు చెందిన కంచర్ల అనుపమ్, రేపల్లె రూరల్ మండలం నల్లూరుపాలెంకు చెందిన శ్రీకాంత్‌లను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా సాక్షి దినపత్రిక రేపల్లె ఆర్సీ ఇన్‌చార్జి పోలబోయిన నాగబాబును పరామర్శించి ఆర్థిక సాయం అందజేసి ఆరోగ్య పరంగా తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో శేషగిరిరావు, చిమటా బాలాజీ, వెంకట కృష్ణారెడ్డి, చదలవాడ శ్రీనివాసరావు, తిలక్, మేడికొండ అనీల్, విసం నాగలక్ష్మీ, ఉమారాణి, ఖుద్దుస్, భాషా, రాంబాబు, ఖాదర్, ఫణి, హేమత్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మంచి అధికారులుగా ఎదగాలి



ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన మహిళను సన్మానిస్తున్న మోపిదేవి వెంకటరమణారావు

నూతనంగా ఉద్యోగం సాధించిన యువతీ యువకులను సన్మానించిన మోపిదేవి

బాపట్లటౌన్: ఉద్యోగం ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. పట్టణంలోని శ్రీసాయి కన్వెన్షన్‌లో ఆదివారం జిల్లాలోని అగ్నికుల క్షత్రియ సామాజికవర్గంలో ఇటీవల ఉపాధ్యాయ, పోలీస్ ఉద్యోగాలు సాధించిన యువతీ యువకులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణారావు మాట్లాడుతూ చదువుకు పేద, ధనిక తారతమ్యాలు లేవన్నారు. కష్టపడి చదివిన ప్రతి ఒక్కరు జీవితంలో ఉన్నతంగా స్థిరపడతారనడానికి మీరే నిదర్శనమన్నారు. ఎంత కష్టపడి ఉద్యోగం సాధించారో అదే నిజాయితీతో పనిచేసి భవిష్యత్తులో మంచి అధికారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అగ్నికుల క్షత్రియ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ అగ్నికుల క్షత్రియ సామాజికవర్గం ప్రజలు తీరప్రాంతాల్లో అభివృద్ధికి, నాగరికతకు దూరంగా దయనీయమైన పరిస్థితిలో జీవిస్తున్నారన్నారు. అలాంటి జీవనం సాగిస్తున్న కుటుంబాల్లో నుంచి కేవలం బాపట్ల జిల్లాలోనే 90 మంది ఉద్యోగాలు సాధించడం హర్షణీయమన్నారు. అనంతరం ఉపాధ్యాయ, కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన యువతీయువకులను మెమెంటోలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మత్స్యకార సెల్ కన్వీనర్ బొమ్మిడి గణేష్, జాతీయ మత్స్యకారుల సంఘం నాయకులు అనంత నగేష్, మోపిదేవి హరినాథ్‌బాబు, అగ్నికుల క్షత్రియ మహా సంఘం గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్, కొక్కిలిగడ్డ సుబ్బారావు, సైకం రాజశేఖర్, కె.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

22 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

చెరుకుపల్లి: గుళ్లపల్లి గ్రామంలో వేంచేసి యున్న గంగాంబిక సమేత ఆనందీశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యన్నారాయణ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఉత్సవాల కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సత్యన్నారాయణ మాట్లాడుతూ గంగాంబికా సమేత ఆనందీశ్వరస్వామి ఆలయంలో గత 48 సంవత్సరాలుగా భక్తుల సహాయ సహకారాలతో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. 22న ఉదయం 6.18 గంటలకు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అఖండ కలశ స్థాపన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. తొమ్మిది రోజులు అమ్మవారిని వివిధ రూపాలలో అలంకరించి, 2న విజయదశమి రోజు అమ్మవారి అలంకారము రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు పూజలందుకోనున్నట్లు తెలిపారు. 3న రాత్రి 7 గంటలకు స్వామి వార్ల శాంతి కల్యాణం, అనంతరం అన్న సంతర్పణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రయాగ రాంబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుంపుగా కుక్కలు.. ప్రజల ఇబ్బందులు



అమృతలూరు(వేమూరు): మండల కేంద్రంలో కుక్కల బెడదతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎక్కడ చూసినా కుక్కలు గుంపుగా తిరుగుతూ అటుగా వెళ్లే వారిపై పగలు రాత్రి తేడా లేకుండా పడుతున్నాయి. దీంతో ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థుల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల సమస్యపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతి బజారులో కుక్కలు ఎక్కువగా ఉన్నాయని, రోజురోజుకు కుక్క కాటుకు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల బెడద నుంచి కాపాడాలని, వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

తెనాలిఅర్బన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబానికి రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రమాద బీమా చెక్కును ఆదివారం పంపిణీ చేశారు. సుల్తానాబాద్‌కు చెందిన కన్నెగంటి ఝాన్సీరాణి, ఖాజీపేటకు చెందిన పోతాబత్తిన వరుణ్ నాగ్ ఇటీవల వేరు వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందారు. వారి ఇళ్లకు వెళ్ళి ప్రమాద భీమాకు సంబంధించిన రూ.5లక్షల చెక్కును పంపిణీ చేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

బాపట్ల: బహుముఖ ప్రజ్ఞాశాలి పార్లమెంటులో ప్రతిపక్షాలను సైతం ఆకర్షించే విధంగా ప్రసంగించే అద్భుతమైన వక్తగా పేరుగాంచిన కామ్రేడ్ సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో చెరగని ముద్ర వేశారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ గంగయ్య అన్నారు. సీతారాం ఏచూరి వర్ధంతిని పురస్కరించుకుని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని ఉప్పరపాలెం సమీపంలో శారదాపురి కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు షేక్ మహబూబ్ సుభాని అధ్యక్షత వహించారు. గంగయ్య మాట్లాడుతూ యువ కమ్యూనిస్టుగా విద్యార్థి ఉద్యమంతో ప్రారంభమై అంచలంచలుగా కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎదిగారని, ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఉచిత వైద్య శిబిరంలో శారదపురికాలనీ, ఉప్పరపాలెం, రైలుపేట ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రజలకు ప్రముఖ వైద్యుడు డాక్టర్ సిద్ధార్థ, డాక్టర్ మధుబాబు, డాక్టర్ సునీత వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి నిర్వాహకులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.కృష్ణమోహన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జడ వినయ్‌కుమార్, అడుగుల శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.కొండయ్య, సీఐటీయూ నాయకుడు తిరుమలరెడ్డి, శరత్‌కుమార్ జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వై.భాస్కరరావు, కె.నాగేశ్వరరావు, దినేష్, లలిత, కిరణ్మయి, ఆసోది రంగారెడ్డి పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మాదకద్రవ్యాలు తరలిస్తే కఠిన చర్యలు : సీఐ




బాపట్లటౌన్: వాహనాల్లో మాదకద్రవ్యాలు సరఫరా చేసినా, వాడినా అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పట్టణ సీఐ రాంబాబు తెలిపారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు వివిధ ప్రాంతాల నుంచి బాపట్ల మీదుగా వెళ్లే వాహనాలను పట్టణంలో నిలుపుదల చేసి తనిఖీలు చేశారు. వాహనాల్లో ప్రయాణించే వ్యక్తులు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన వ్యక్తులపై చర్యలు తీసుకుంటామన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

పాము కాటుకు గురై పాడి గేదె మృతి

కొల్లూరు: మేత మేస్తుండగా పాము కాటుకు గురై ఓ పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని పెసర్లంకలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పెసర్లంకకు చెందిన పసుపులేటి శ్రీనివాసరావుకు చెందిన పశువులను ఆదివారం కృష్ణా నది సమీపంలోని ఖాళీ పంట భూములలో మేత మేపుకొని వచ్చేందుకు తోలుకొని వెళ్లారు. సాయంత్రం ఓ పాడి గేదె మేత తినకుండా అసౌకర్యంగా ఉండటం గమనించిన యజమాని దానిని ఇంటికి తోలుకెళ్లే ప్రయత్నం చేశాడు. కొంత దూరం వెళ్లిన గేదె మార్గంమధ్యలో ఉన్న పళంగా పడిపోయి కొద్ది సేపటికి ప్రాణాలు వదిలింది. మరణించిన గేదెను పరిశీలించిన స్థానికులు పాము కాటుకు గురై మరణించి ఉండవచ్చునన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. పాడి గేదె మరణించడంతో సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాంకేతిక శిఖరం మోక్షగుండం

- నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి
- జాతీయ ఇంజనీర్ల దినోత్సవం



కొల్లూరు మండలం పెసర్లంక నుంచి చింతర్లంక వరకు నిర్మించిన అరవింద వారిధి(ఫైల్)

వేమూరు: ఇంజనీరింగ్ రంగంలో దేశానికి కీర్తి కిరీటంలా నిలిచారు మోక్షగుండం విశ్వేశ్వరయ్య. ఆయన తన ప్రజ్ఞా పాటవాలతో బీళ్లను సైతం సస్యశ్యామలం చేశారు. నదులపై ఆయన నిర్మించిన ఆనకట్టలు నేటికీ ఆయన ప్రజ్ఞకు తార్కాణంగా నిలిచి ఉన్నాయి. నేడు ఆయన జయంతి. ఈ సందర్భంగా ఆయన గురించి 'సాక్షి' పాఠకులకు ప్రత్యేకం.

- మనిషికి కూడు, గుడ్డతోపాటు నీరు కూడా అవసరమే. సమాజం అభివృద్ధి చెందే కొద్దీ ఇళ్లతో పాటు మానవ మనుగడకు ఎన్నో కట్టడాలు అవసరమవుతాయి. కర్మాగారాలు, ప్రాజెక్టులు, కార్యాలయాలు, ప్రార్థనా మందిరాలు ఇలా ఎన్నో నిర్మాణాలతో ఇంజనీర్లు తమ ప్రతిభను, ఉనికిని చాటుతూనే ఉన్నారు. తన ప్రతిభతో దేశంలోనేగాక ప్రపంచంలోని మరెన్నో దేశాల ప్రశంసలు పొందిన ఉన్నత స్థాయి ఇంజనీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య.

మైసూరు దివాన్‌గా...

సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన స్వయంకృషితో ఉన్నత స్థాయి సాంకేతిక ప్రజ్ఞా మూర్తిగా పేరు గడించారు. సివిల్ నిర్మాణాలు, నీటి పారుదల, వరదల నివారణ కోసం ప్రత్యేక నిర్మాణాలు ఇలా ఎన్నో విశిష్టమైన కట్టడాల నిర్మాణంతో ఆయన ఇతర దేశాల సాంకేతిక నిపుణుల ప్రశంసలు పొందారు. 1816లో కర్ణాటక కోలార్ జిల్లాలో జన్మించిన మోక్షగుండం పూర్వీకులు ప్రకాశం జిల్లాకు చెందిన వారే. బెంగళూరు, పూణేలలో విద్యాభ్యాసం చేసి సివిల్ ఇంజనీరింగ్‌లో ఆయన ప్రతిభ చూపారు. ప్రత్యేకించి నీటిపారుదల నిర్మాణాలపై ప్రత్యేక అధ్యయనం చేసి సమకాలీన ఇంజనీర్ల కంటే ఎంతో ఉన్నత స్థానంలో నిలిచారు. 1908లో మైసూరు మహారాజు ఆయనను తమ రాష్ట్రంలోని రాజ్యసభ చీఫ్ ఇంజనీరుగా నియమించారు. ఆయన మార్గదర్శకత్వంలోనే కావేరి నదిపై కృష్ణరాజసాగర్‌ను నిర్మించారు. 1912లో మైసూరు దివాన్ అయ్యారు. కర్ణాటకలో ఆయనదైన ముద్ర గల నిర్మాణాలెన్నో నేటికీ అందరినీ ఆకర్షిస్తూ చెక్కు చెదరకుండా ఉన్నాయి.

మోక్షగుండంను ఆదర్శంగా తీసుకోవాలి

వేమూరు నియోజకవర్గంలోని ఇంజనీరింగ్ చదివిన, చదువుతున్న విద్యార్థులు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలి. ఆయన సివిల్ ఇంజనీరింగ్ చదువుకున్నారు. దేశంలో బ్రిడ్జిలు, ఆనకట్టల నిర్మాణానికి దిక్సూచిగా నిలిశారు. ఇంజనీరింగ్ విద్యార్థులు ఆయనలా గుర్తింపు తెచ్చుకోవాలి. ఆయన ప్రతిభను గుర్తించి ఏటా సెప్టెంబరు నెల 15న ఇంజనీరింగ్ డే నిర్వహించడం జరుగుతుంది.

సేవా కార్యక్రమాలే సంస్థ లక్ష్యం

కర్లపాలెం: స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహించటమే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ లక్ష్యమని సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి చెప్పారు. స్థానిక పెద్దింటమ్మ కల్యాణ మండపంలో ఆదివారం సేవా సంస్థ సభ్యుల సమావేశం జరిగింది. వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో మండల స్థాయి నూతన కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, కార్యదర్శిగా పరమానందకుమార్, సహాయ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్‌గా లలితబాబు, సభ్యులుగా ఏడుగురిని ఎంపిక చేశారు.